క్లుప్తంగా

రూ.11 కోట్లకు చేరిన టర్నోవర్

మలికిపురం: మండలంలోని రామరాజులంక పీఏసీఎస్ టర్నోవర్ రూ.11 కోట్లకు చేరిందని సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చొప్పల రాజేశ్వరరావు తెలిపారు. సంఘ మహాజన సభ బుధవారం జరిగింది. 2022–23లో, సంఘంలో రూ.90 లక్షల ఆదాయం వచ్చిందని పేర్కొన్న సమావేశం గత సంవత్సర ఖర్చులు, ప్రస్తుత సంవత్సర అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. వడ్డీ రాయితీని రైతులకు సక్రమంగా అందించినట్లు కూడా సభ పేర్కొంది. సీఈఓ దేశినీడి నారాయణరావు, సర్పంచ్ కాకర శ్రీనివాస్, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ నల్లి శివకుమార్, సభ్యులు పొన్నమండ సత్యనారాయణ, ముద్దల రామకృష్ణ, ముత్యాల దొర తదితరులు పాల్గొన్నారు.

మండల క్రిస్టియన్ మైనార్టీ కమిటీ ఏర్పాటు



ఎమ్మెల్యే రాపాకను కలసిన క్రిస్టియన్ మైనార్టీ కమిటీ సభ్యులు

మలికిపురం: మండల క్రిస్టియన్ మైనార్టీ కమిటీ నూతనంగా ఏర్పాటయింది. కమిటీ అధ్యక్షుడిగా ఆర్‌వీ రావు, ఉపాధ్యక్షులుగా ఎస్.కిషోర్, ఎస్.శాంతరాజు, జనరల్ సెక్రటరీలుగా టి.సుధాకిషోర్, ఆర్.జాతిత్య, కార్యదర్శులు, సభ్యుల నియామకం జరిగింది. కమిటీ బుధవారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావును మలికిపురంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల దళిత క్రిస్టియన్‌లను ఎస్సీలుగా ఉంచే విధంగా బిల్లు పెట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో దళిత క్రిస్టయన్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను వారు కోరారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

అంగన్‌వాడీ టీచర్‌కు సత్కారం

సఖినేటిపల్లి: మండలంలోని మోరిపోడు–2లో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తూ ఈ నెలాఖరుకు ఉద్యోగ విరమణ చేయనున్న యెనుముల లక్ష్మికి ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యాన బుధవారం సత్కారం చేశారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో టీచర్ లక్ష్మిని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు శాలువాతో సన్మానించారు. ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి, నాయకులు కేఎస్ఎన్ రాజు, ముప్పర్తి త్రిమూర్తులు, వలవల అంజి, వలవల రాంబాబు, మోరి సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

భజన మండలికి హార్మోనియం అందజేత

ఆలమూరు: మండలంలోని పెనికేరుకు చెందిన పద్మావతి భజన మండలికి కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి హార్మోనియం అందించారు. ఇటీవల గ్రామంలో గడప గడపకూ కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో ఆ భజన మండలి సభ్యులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని హార్మోనియం సమకూర్చమని అడిగారు. దీంతో ఆయన వైఎస్సార్ ఆసరా సమావేశంలో భజన మండలి సభ్యులకు ఆ హార్మోనియాన్ని అందజేశారు. సర్పంచ్ వసుం చిన్నావతి, ఎంపీటీసీ వై.స్వాతి, పీఏసీఎస్ అధ్యక్షులు జుత్తుక శ్రీనివాసు, వసుం జార్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

సభ్యులను ఆదుకుంటున్న సహకార పొదుపు సంఘం

పి.గన్నవరం: ధనవర్ష పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం తమ సభ్యులను అన్ని విధాలా ఆదుకుంటున్నదని సంఘ చైర్మన్ కంకిపాటి ప్రసాద్ అన్నారు. పోతవరంలోని సంఘ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వై.కొత్తపల్లి గ్రామానికి చెందిన సంఘ సభ్యురాలు బొంతు లక్ష్మి ఇటీవల ప్రమాదవశాత్తూ మరణించగా, ఆమె కుటుంబానికి మంజూరైన రూ.లక్ష భీమా సొమ్మును ప్రసాద్ అందజేశారు. సంఘ క్షేత్ర సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్య బాధితురాలికి ఆర్థిక సాయం

కొత్తపేట: మండలంలోని గంటి గ్రామానికి చెందిన అంబటి మాణిక్యం అనారోగ్యంతో బాధపడుతుంది. ఆమెకు కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి వారు రూ.10 వేల సాయం అందజేశారు.

కంటి వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు

అంబాజీపేట: కంటికి సంబంధించిన వ్యాధులు సంభవిస్తే నిర్లక్ష్యం వహించకుండా వైద్యులను సంప్రదించాలని పార్టీ నాయకుడు వాసంశెట్టి పెదబాబు అన్నారు. వక్కలంక గ్రామ పంచాయతీ వద్ద వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా లబ్ధిదారులకు కళ్ళజోళ్లను బుధవారం పంపిణీ చేశారు.

పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్‌గా వెంకటేశ్వరరావు

అయినవిల్లి: బీజేపీ పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్‌గా అయినవిల్లి మండలం ఎస్.మూలపాలెం గ్రామానికి చెందిన చీకురుమిల్లి వెంకటేశ్వరరావు నియమించినట్లు ఆ పార్టీ నుంచి తనకు ఉత్తర్వులు అందాయని బుధవారం నాడొక ప్రకటనలో చీకూరుమిల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. తనకు పదవి రావడానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

సీతారాముల కల్యాణం చూతము రారండి

- నేడు శ్రీరామనవమి
- రామాలయాల్లో వేడుకలకు సర్వం సిద్ధం

కొత్తపేట: తెలుగు సంవత్సరాది (ఉగాది) అనంతరం తొలి హిందూ పండగ శ్రీరామనవమి. చైత్ర శుద్ధ నవమి నాడు శ్రీరామనవమి జరుపుకొంటారు. రామాలయం లేని గ్రామం ఉండదంటే అతిశయోక్తి కాదు. శ్రీరామనవమి వస్తోందంటే ఆయా గ్రామాల్లో రామాలయాలు కల్యాణ సందడితో కళకళలాడతాయి. రాములవారి పెళ్లికి ఊరంతా సంబరాలు అన్నట్టుగా నిర్వహిస్తారు. గురువారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లోని రామాలయాలు, ఆంజనేయస్వామి వారి ఆలయాలు, పలు విష్ణాలయాలలో శ్రీరామనవమి వేడుకలకు, శ్రీసీతారాముల కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా ఆయా ఆలయాలు చలువ పందిళ్లు, పచ్చని తోరణాలతో కళకళలాడుతున్నాయి.

పలుచోట్ల భారీ ఏర్పాట్లు

శ్రీరామనవమి సందర్భంగా పలు ప్రాంతాల్లోని రామాలయాల వద్ద భారీ ఏర్పాట్లు చేశారు. కొత్తపేట శ్రీకోదండరామాలయం వద్ద భద్రాచలంలో సీతారాముల కల్యాణం ఏ సమయానికి నిర్వహిస్తారో అదే సమయానికి నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. భద్రాచలంలో కల్యాణోత్సవం తరహాల్లో ఇక్కడ కల్యాణం నిర్వహిస్తారు. దాంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా ఇక్కడకు అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకిస్తారు. ఈ ఆలయంతో పాటు పలు ఆలయాల్లో రాముల వారిని, సీతమ్మవారిని కల్యాణమూర్తులుగా అలంకరించి పండితుల వేదఘోష నడుమ భక్త దంపతులు పీటలపై కూర్చుని శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహిస్తారు. పలువురు భక్తులు కల్యాణానికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారు. ప్రతిచోటా భక్తులకు విసనకర్రలు, పానకాలు, చలివిడి, వడపప్పు, పులిహోర ప్రసాదంగా పంపిణీ చేస్తారు. పలుచోట్ల భారీ అన్న సమారాధనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.



రావులపాలెంలో రామాలయం వద్ద శ్రీరామనవమి ఏర్పాట్లు

అంబాజీపేటలో..

అంబాజీపేట: శ్రీరామ నవమిని పురస్కరించుకొని గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఆలయాలను ముస్తాబు చేశారు. అంబాజీపేట, మాచవరం, గంగలకుర్రు, ముక్కామల, గంగలకుర్రు అగ్రహారం, మొసలపల్లి, ఇసుకపూడి, చిరతపూడి, వక్కలంక, కేవీ లంక, నందంపూడి, వాకలగరువు, తొండవరం, నందంపూడి, కె.పెదపూడి, ఇరుసుమండ, పసుపల్లి గ్రామాల్లో ఉన్న దేవాలయాలను నిర్వాహకులు ఆలయాలను సర్వాంగ సుందరంగా విద్యుత్ దీపాలతో అలకరించారు. శ్రీరామ నవమి వేడుకకు అధిక సంఖ్యలో హాజరయ్యే భక్తులకు వేసవి తాపం లేకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణాల వద్ద పోటాపోటీగా పానకాలను సిద్ధం చేస్తున్నారు. కొన్ని ఆలయాల వద్ద భారీ అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు.



కొత్తపేట కోదండరామాలయం

రాములవారి పంచలోహ విగ్రహాల సమర్పణ



మాచవరం రామాలయానికి సమర్పించిన శ్రీరాముల పంచలోహ విగ్రహాలు

అంబాజీపేట: మాచవరంలో వేంచేసియున్న రామాలయానికి పంచలోహ ఉత్సవ విగ్రహాలను స్థానిక భక్తులు మంచాల నాగబాబు, అనితలు బుధవారం సమర్పించారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని శ్రీసీతారామాంజనేయ పంచలోహ ఉత్సవ విగ్రహాలను ఆలయానికి ఇచ్చామని నాగబాబు దంపతులు తెలిపారు. తొలుత పంచలోహ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గడపగడపతో సమస్యల పరిష్కారం



చింతలపల్లిలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు



అయినవిల్లిలో లబ్ధిదారులకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

- చింతలపల్లి, అయినవిల్లిల్లో గడప గడపకూ..
- పాల్గొన్న ఎమ్మెల్యేలు రాపాక, కొండేటి

రాజోలు: గ్రామాల్లో చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి గడపగడపకూ మన ప్రభుత్వం వేదికగా నిలుస్తుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం చింతలపల్లిలో గడపగడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాపాక పాల్గొని ఇంటింటా పర్యటించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పరిపాన వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేశారన్నారు. గ్రామాల్లోని ప్రజలకు అన్ని ప్రభుత్వ సేవలు, సౌకర్యాలు అందుబాటులో ఉంచారన్నారు. గ్రామసచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, నాడు–నేడు పథకంలో పాఠశాల అభివృద్ధి, విద్య, వైద్య, వ్యవసాయం తదితర రంగాలను బలోపేతం చేయడం వంటి పనులు వైఎస్సార్ సీపీ హయాంలోనే జరుగుతున్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని విజయపథంలో నిలపాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, మాజీ ఎంపీటీసీ ఇంటిపల్లి బుజ్జి, ఆకుల వెంకటేశ్వరరావు, దార్ల పెదబాబు, చెల్లింగి చినబాబు పాల్గొన్నారు.

జనం మెచ్చిన పాలకుడు సీఎం జగన్

అయినవిల్లి: రాష్ట్రంలో జనం మెచ్చిన పాలకుడిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేరు పొందారని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. బుధవారం అయినవిల్లిలో గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు గ్రామంలో ప్రతి ఇంటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభించి సాయంత్రం ఆరు గంటల వరకూ గడపలకు వెళ్లి ప్రజలను సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందారన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ అర్హతను పరిశీలించి పథకాలను అందిస్తున్నారన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను, గ్రామస్తులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను తర్వితగతిన పరిష్కరిస్తామని ఎమ్మెల్యే చిట్టిబాబు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, సర్పంచుల సమాఖ్య మండల అధ్యక్షురాలు వార జయసావిత్రి, వైఎస్సార్ సీపీ నాయకులు బొంతు రాజేంద్రప్రసాద్, కొనే చంద్రశేఖర్, గుత్తుల నాగబాబు, బడుగు దుర్గాదేవి, వార లక్ష్మీనరసింహరామ్, నంబూరి రాంబాబు, పచ్చిమాల సుబ్బారావు, మట్టపర్తి రామారావు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు ఘనస్వాగతం

కొత్తపేట/రావులపాలెం/అంబాజీపేట: ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా నియమితులై మొదటిసారి జిల్లాకు విచ్చేసిన బొమ్మి ఇజ్రాయిల్, ఆయనతో పాటు విచ్చేసిన ఎంపీ నందిగం సురేష్‌లకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి రావులపాలెం మండలం గోపాలపురం గ్రామం వద్ద బుధవారం ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి స్వగృహానికి విచ్చేసిన వారికి శాలువా, పూలమాలలతో సత్కరించారు. స్థానిక కోనసీమ ముఖద్వారం వద్ద అభిమానులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో క్రేన్ సాయంతో భారీ పూలమాలలను వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ మాట్లాడుతూ మాదిగలకు ఎన్నడూ లేని గౌరవాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారన్నారు. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు కప్పల శ్రీధర్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కొత్తపేట పాతబస్టాండ్ సెంటర్‌కు చేరుకోగానే వైఎస్సార్ సీపీ శ్రేణులు, మాదిగ పొలిటికల్ జేఏసీ, ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాలలు వేసి స్వాగతం పలికారు. అంబాజీపేట సెంటర్‌లోనూ ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, ఎంపీ సురేష్‌లకు స్థానిక ఎమ్మెల్యే చిట్టిబాబు ఆధ్వర్యాన ఘనస్వాగతం పలికారు.



గోపాలపురంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, ఎంపీ సురేష్‌లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

మామిడికుదురు: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా పురోగమించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఉద్బోధించారు. మొగలికుదురు గ్రామ పరిధిలోని జగ్గన్నపేట శ్రీసత్యసాయి కల్యాణ మంటపంలో బుధవారం ఉచితంగా శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. వీటితో పాటు మగ్గాలు అందజేశారు. బ్యాంకర్ల గ్రామీణ మరియు ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 84 మంది మహిళలకు 37 రోజుల పాటు మగ్గం, జర్దోసిపై ఉచితంగా శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో అభివృద్ధి సంస్థ డైరెక్టర్ డి.నాగ రాజకుమార్ ఆధ్వర్యంలో మహిళలకు ఎమ్మెల్యే చిట్టిబాబు సర్టిఫికెట్లు, మగ్గాలు అందించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలకు డిజైనింగ్‌పై ఉచితంగా శిక్షణ ఇవ్వడం శుభ పరిణామమన్నారు. దీన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని తమ ఆర్థిక పరిస్థితిని మెరుగు పర్చుకోవాలన్నారు. ఈ తరహా శిక్షణ కార్యక్రమాలు మరిన్ని ఏర్పాటు చేసే దిశగా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. శ్రీసత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు ఎంతో క్రమశిక్షణతో ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం ముదావహమన్నారు. కార్యక్రమంలో కడి శ్రీను, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు మేనేజర్ టీవీఎస్‌పీ శివప్రసాద్, శ్రీసత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు అడబాల కొండబాబు, రాష్ట్ర మహిళా సేవాదళ్ కోఆర్డినేటర్ కిరణ్‌కుమారి, జోనల్ కన్వీనర్ జి.ప్రభాకర్, సాధన విభాగ సమన్వయకర్త కె.ప్రభాకర్, జిల్లా సేవా విభాగ సమన్వయకర్త ఎం.నరసింహారావు, ఆధ్యాత్మిక విభాగ సమన్వయకర్త నెక్కంటి లక్ష్మి, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ కె.నాగప్రసాద్, మహిళా ఇన్‌చార్జ్ బి.అమ్మాజీ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

పి.గన్నవరం: విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంపీపీ అంబటి భూలక్ష్మి అన్నారు. మండలంలోని ముంగండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన పాఠశాల వార్షికోత్సవ, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభలో భూలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. హెచ్‌ఎం బందారు సుభాషిణీ అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ మాట్లాడారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి, అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ కుసుమ చంద్రకళ, నాయకులు అంబటి కోటేశ్వరరావు, కుసుమ వెంకటేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ చీకట్ల శ్రీరామచంద్రమూర్తి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలి

ఆలమూరు: చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు మెరుగైన ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ ఆరోగ్య పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని పెదపళ్ల పీహెచ్‌సీ సూపర్‌వైజర్ పీవీ రమణారావు అన్నారు. మండలంలోని పినపళ్ల, సందిపూడి, చింతలూరు, పెదపళ్ల తదితర గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి ఆరోగ్య ఉప కేంద్రాలను, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. వైఎస్సార్ ఆరోగ్య పోషణ కిట్ల ఉపయోగంపై అవగాహన కల్పించి లబ్ధిదారులకు అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

మామిడికుదురు: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని పెదపట్నం లంక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోకా వెంకన్నబాబు పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు బుధవారం వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ గిడుగు విజయనారాయణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం: మండలంలోని ఊబలంక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అన్ని 11 కేవీ ఫీడర్లకు శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ బుధవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో అదనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చేందుకు ఊబలంక గ్రామంతో పాటు, రావులపాలెం అంకాలమ్మగుడి ఏరియా, కొత్తపేట రోడ్డు ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులు అంకితభావంతో చదువుకోవాలి

మామిడికుదురు: స్థానిక బాలుర, బాలికల వసతి గృహాల్లో చదువుకుంటున్న 10వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో ప్యాడ్లు, పెన్నులు, పరీక్షకు అవసరమైన సామాగ్రిని పంపిణీ చేశారు. ఎంఈఓ కోన హెలీనా చేతుల మీదుగా వీటిని అందజేశారు. మొత్తం 42 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ హెలీనా మాట్లాడుతూ విద్యార్థులు అంకితభావంతో చదువుకోవాలన్నారు. కోన హెలీనా కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు పెయ్యల వీరభద్రరావు, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు, సహాయ కార్యదర్శి భయ్యా మోహనరావు, ఆర్థిక కార్యదర్శి సాధనాల సత్యనారాయణ, మండల శాఖ భూపతి మనోహరరాజు, ప్రధాన కార్యదర్శి కారుపల్లి కల్యాణ్‌బాబు, ఆర్థిక కార్యదర్శి నేల శ్రీనివాసరావు, సభ్యులు తోట రాజారావు, చొప్పళ్ల గోపీ, మట్టా నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వైద్య సేవలు

కొత్తపేట: ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రజలకు అందుబాటులో వైద్య పరీక్షలు, వైద్య సేవలు అందించాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బందికి సూచించారు. మండలంలోని అవిడి పీహెచ్‌సీలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి కృషి మేరకు డీఎంఅండ్‌హెచ్‌ఓ నిధులు రూ.4.50 లక్షలతో యలక్ట్రోలైట్, బయోకెమిస్ట్రీ, యూరిన్ ఎనలైజర్స్ తదితర రక్త పరీక్షల పరికరాలు సమకూర్చారు. వాటిని బుధవారం ఉదయం ఎంపీపీ గంగాధరరావు ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఏ వ్యాధి వచ్చినా రక్త పరీక్షలకు పట్టణ ప్రాంతాల్లో ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లవలసి వచ్చేదన్నారు. ఆ అవసరం లేకుండా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందుబాటులోని పీహెచ్‌సీల్లో వైద్య పరీక్షలు, వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. సమావేశంలో అవిడి, మోడేకుర్రు సర్పంచ్‌లు రెడ్డి చంటి, కుడుపూడి రామలక్ష్మి, వైద్యులు పి.రవికుమార్, వి.ఇందిరాభారతీరాయ్ తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం వానపల్లి పీహెచ్‌సీలో ఆ పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. పలు అంశాలను చర్చించారు. సమావేశంలో వానపల్లి, మందపల్లి సర్పంచ్‌లు పల్లి భీమారావు, సాదు వెంకటలక్ష్మి, వైద్యాధికారి కేఎస్ఎస్‌బీ హర్ష తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌లో విద్యార్థుల ప్రతిభ

రాజోలు: జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో రాజోలు మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ చూపారని ఎంఈఓ ఎం.విజయశ్రీ బుధవారం తెలిపారు. కూనవరం ఉన్నత పాఠశాలకు చెందిన కుసుమ భవ్య శ్రీదుర్గ జిల్లాస్థాయిలో తొమ్మిదో ర్యాంకు సాధించింది. పొన్నమండ ఉన్నత పాఠశాలకు చెందిన నక్కా శ్రీ సూర్య, రాజోలు బాలికోన్నత పాఠశాలకు చెందిన సిద్ద రాజేశ్వరి ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ చూపారు. వీరిని ప్రధానోపాధ్యాయులు పట్టా భాస్కరరావు, సుహాసిని, ఎస్‌ఎంసీ చైర్మన్లు అప్పారి శ్రీనివాస్, బోనం వెంకటేశ్వరరావు, కట్టా పార్వతి తదితరులు అభినందించారు.

వైఎస్సార్ ఆసరా.. మహిళలకు భరోసా

- ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- వైఎస్సార్ ఆసరా కింద రూ.15.65 కోట్లు

ఆలమూరు: రాష్ట్రంలోని మహిళలందరికి ఆర్థిక భరోసా కల్పించేందుకు వైఎస్సార్ ఆసరా ప్రవేశపెట్టి సీఎం జగన్ మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అయ్యారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్‌లోని ఎస్‌జేఆర్ కల్యాణ మండపంలో పార్టీ మండల కన్వీనర్ సర్పంచ్ తమ్మన శ్రీనివాసు, సర్పంచ్ నేలపూడి లావణ్య ఆధ్వర్యాన బుధవారం మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకం కింద రుణమాఫీ చెక్కుల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షత వహించగా ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మహిళల సంక్షేమ కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ఇప్పటికే మండలంలోని మూడు విడతలుగా మండలంలోని డ్వాక్రా సంఘాల మహిళలకు 46.95 కోట్లు అందజేశామన్నారు. ఇలాంటి సంక్షేమ, అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వాన్ని మునుపెన్నడూ మహిళలు చూడలేదన్నారు. నియోజకవర్గంలోని మహిళల సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేస్తున్నామని మహిళల హర్షధ్వానాల మధ్య ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ప్రకటించారు. అనంతరం వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడో విడతగా 16,520 డ్వాక్రా సంఘాలకు గాను రూ.15.65 కోట్లు విలువైన చెక్కు అందజేశారు. ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, ఏపీఎం ఎం.ధనరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ చిత్రపటానికి మహిళలతో కలసి ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, పీఏసీస్ చైర్మన్లు నెక్కంటి వెంకట్రాయుడు, మోటుపల్లి వెంకన్న, జుత్తుక శ్రీనివాసు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు యనమదల నాగేశ్వరరావు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు చల్లా వెంకట సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీలు వాసంశెట్టి దుర్గాభవానీ, నేలపూడి రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, డ్వాక్రా మహిళలు



అంబాజీపేటలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు, డ్వాక్రా మహిళలు

మహిళల ఆర్థిక చైతన్యానికి ఆసరా: ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: మహిళల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, వారిని ఆర్థికంగా నిలదొక్కుకునేలా వైఎస్సార్ ఆసరా పథకానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట మార్కెట్ యార్డు ఆవరణలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా మూడవ విడత చెక్కుల పంపిణీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి అనంతరం అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తూ ప్రజలకు అండగా ఉంటున్నారని అన్నారు. మహిళ లందరూ ఆర్థికంగా నిలదొక్కుకునేలా వైఎస్సార్ ఆసరా పథకానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. మండలంలో 1285 గ్రూపులకు గాను రూ.9.67 కోట్లు మహిళలకు ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం డ్వాక్రా మహిళలకు చెక్కులను అందజేరు. ఈ సందర్భంగా సీఎం.వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఉభయ గోదావరి జిల్లాల గ్రావెన్స్ అధ్యక్షులు పేరి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు కొర్లపాటి కోటబాబు, వైస్ ఎంపీపీలు నేతల నాగరాజు, సూదాబత్తుల లక్ష్మిభార్గవి, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షులు వాసంశెట్టి చినబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, నాగవరపు నాగరాజు, జిల్లా ప్రచార అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, మైలా ఆనందరావు, ఏపీఓ, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

ఇంటింటికీ డస్ట్ బిన్‌ల పంపిణీ

మలికిపురం: మండంలోని మేడిచర్లపాలెం గ్రామంలో బుధవారం ఇంటింటికీ డస్ట్ బిన్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. కోహస్స్ లైఫ్ సైన్స్ లిమిటెడ్ సంస్థ సహకారంతో అందించిన సుమారు వెయ్యి డస్ట్‌బిన్‌లు గ్రామానికి చెందిన మేడిచర్ల కనక మల్లేశ్వరరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా క్లీన్ గ్రామ పంచాయతీగా చేసే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు సర్పంచ్ మేడిచర్ల వల్లీశ్వరి పేర్కొన్నారు. ఎంపీటీసీ ముత్యాల సాయిరామ్, మాజీ సర్పంచ్ అన్నంనీడి దత్తుడు, ఎంపీడీఓ ఉండ్రు బాబ్జి రాజు, ఈఓపీఆర్‌డీ మంగాదేవి, పంచాయతీ కార్యదర్శి ఇంజేటి శుభాకర్, సొసైటీ సీఈఓ కనకలింగేశ్వరరావు, గుబ్బల గిరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి వారి విగ్రహావిష్కరణ

పి.గన్నవరం: ముంగండ గ్రామ శివారు పెచ్చెట్టివారిపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి వారి విగ్రహాన్ని ఎంపీపీ అంబటి భూలక్ష్మి, కోటేశ్వరరావు దంపతులు బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా స్వామికి వారు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే స్థానిక భక్తులు ఆంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెచ్చెట్టి వెర్రియ్య, డాక్టర్ బుజ్జి, కుడుపూడి రమేష్, వాసంశెట్టి శ్రీనివాస్, పెచ్చెట్టి సాయి తదితరులు పాల్గొన్నారు.